# గధేకి బిర్యాని...

-కొలనుపాక మురళీధరరావు

ఆ కాలంలో పాతబస్తీలో మూసీ సెలయేరుగ పారుతుండేది. అక్కడక్కడ పచ్చని గడ్డి కొంచెం దూరం పోతే దోభిఘాట్ దండాలపై రంగు రంగుల బట్టలు వేసి ఆరబెట్టేవారు. ఇంక ఆనాడు చాకలి వాళ్ళకు వాళ్ళ బట్టలు మోసెటందుకు గాడిదలు కూడ ఉండేవి. రిక్షాలు చాలా తక్కువ. తాంగాలు, ఇంకా మోటారు కార్లు రోడ్డు మీద అడపతడపా తిరుగుతూ కనబడ్తాయి. అప్పుడో ఇప్పుడో డబల్ బస్సులు. ఆ పక్కనే హైకోర్టు బిల్డింగ్, పత్తర్‌గట్టీ, చార్మినారు వరకు వచ్చిపోయె జనంతో బజార్లు కిటకిటలాడుతుంటాయి. ఇంగ జుమ్మెరాత్ బజారు సరేసరి. ఏడదొరకని వస్తువు ఆడ పాత వస్తువులు సైతం దొరకుతాయని సస్తామాల్ కొరకు కొంత మంది పోతుంటరు.

## విభజన రేఖ

నువ్వు
సూర్యోదయాన్ని వర్ణిస్తావు.
నేను
కాడికి కట్టిన ఎడ్లను
నాగలికి కొట్టిన కర్రును
మేడిపట్టి దున్నుతున్న రైతును
నాగేటి సాలులోని మొలకెత్తే
గింజను గురించి ఆలోచిస్తుంటాను.
నువ్వు
వెన్నెల గురించి మాట్లాడుతావు.
నేను
గాయపడిన మట్టిని
వొట్టిపోయిన ఆకాశాన్ని
అద్దంలో కుదించుకుపోయిన కొండలా
ఇరుకైపోయిన జీవితాన్ని
అనుకోని మలుపులో
అదృశ్యమైపోయిన ఆశలను
ఆవిష్కరిస్తుంటాను.
నువ్వు
పూదోటల సౌందర్యాన్ని వివరిస్తావు.
నేను
అడవి ఎడారిగా మారిపోయిన వైనాన్ని
చెదిరిన గూటిని విడిచిపోతున్న
పక్షుల వలస రెపరెపలను
పచ్చని చెట్టు / పొయ్యి కింద కట్టెలుగా మారిన
పొగలో కన్నీరౌతుంటాను.
ఇంక
నువ్వూ నేనూ ఒకటేనంటే ఎలా?
ఆకాశంలో విమానంలో ప్రయాణిస్తూ నువ్వూ
పొలం గట్లమీద పరుగెత్తుతూ నేను
ఏ మానవీయ రేఖమీద
కలుస్తామో చూడాలి!

-ఎన్. అరుణ

ఖాదర్‌మియా చాయ్‌ఖానా అంటె తెలియనోళ్ళు ఉండరు. హైకోర్టు వకీళ్ళు కూడా అక్కడినుండే చా తెప్పించుకుంటారట. మషూరు అయినది 'ఖాదర్‌మియా చాయ్‌ఖానా' యాపారం బాగా సాగుతున్న రోజుల్లో తన బామ్మర్దిని పిలిపించుకుండు సాయంగ ఉంటదని. వాడు బలే హుషార్ పోరగాడు. తేజ్ దమాఖ్‌గాడు.

ఒకరోజు బావా మన చాయ్‌ఖానా పెంచి బిర్యాని ప్లేటుకింత రేటు పెడితే ఇంకా గిరాకీ బాగా ఉంటది. హైకోర్టుకు వచ్చిపోయెటోళ్ళు, ఇంకా రిక్షావోళ్ళు ప్లేటు బిర్యాని తిని చాయ్‌తాగిపోతె మనకి కూడా ఆమ్దని పెరుగుద్ది. సోచాయించు బావా అని ఖాదర్‌మియా చెవిలో పోరుపెట్టసాగిండు చోటే ఉరఫ్ బాబాఖాన్.

అరె ఛోటే, బిర్యాని అంటే మామూలారా వాసన బియ్యం మటన్ లేదా చికన్ ఇంకా ఆలూ కుర్మా కావాలి ఏందో గుట్టుచప్పుడుగా ఈయాపారం ఈ చాయ్‌ఖానా నడుపుతున్న. ఎచ్చులకుపోయి ఎల్లలపడేటందుకన్న ఇట్లాగే ఈ చాయ్‌ఖానా నడుపుకుందాం. బామ్మర్దితో ఖాదర్ అంటె, రజియ బీబి మా తమ్ముడు చెప్పింది ఇన్కో వాడు బొంబాయి నుండి వచ్చిండు. వాడు చూస్కుంటాడు నీవెమో చాయ్‌ఖానా నడిపించు. నేను మా తమ్ముడు మా అమ్మిజాన్ బిర్యాని తయారుచేస్తాం. నీవు ఏం బుగులుపడకు అంటూ భరోసా ఇచ్చిన్రు.

"బిస్మిల్లా" అంటూ ఐదు రూపాయలకే ప్లేటు బిర్యానితో కప్ చాయ్ 'ఫ్రీ'యని ఖాదర్ చాయ్‌ఖానా పేరుమార్చి 'ఖాదర్ బిర్యాని సంటర్'గా మార్చిండ్రు. దానికి తగ్గట్టుగ బెంచీలు రెండు టేబుళ్ళు వేసిండ్రు. గిరాకీ రోజురోజుకు పెరుగుతాంది.

ఐదారు నెలలు బాగానే నడిచంది. మటన్, చికన్ ధరలు పెరిగిపోయినై. ఐదు రూపాయలకే ప్లేటు బిర్యాని ఇవ్వడం నుక్సాను అవుతది. ఏంచేద్దాం సాలెసాబు. "నీవు బేఫికర్‌గ ఉండు బౌనేసాహెబ్ నేను చూసుకుంటా" మరోసారి భరోసా ఇచ్చిండు బాబాఖాన్. మెల్లగ సోచాయించుకుంటూ మూసీనది ఒడ్డున తిరగ ఒట్టిండు. నీళ్ళు బాగా నిండ ఉన్నయి. ఒడ్డెంట చాకలోల్ల గాడ్దులు మేస్తున్నై. వాటి వంకనే చూస్తూ సోచాయిస్తుండు. బలంగనే యున్నవి. 'ఐడియా' అనుకొని అమలుకు పెట్టిండు. మరుసటి రోజు 'స్పెషల్ బిర్యాని' ఆలు కుర్మాతో పాటు ప్లేటు ఆరు రూపాయలు మాత్రమే అని బోర్డు తగిలించున్రు.

పలుచబడ్డ గిరాకి పుంజుకుంది. యాపారం ఫాయిదాలో పడ్డది. అయితె మూసీ దోభీఘాట్‌లో కలకలం పుట్టింది.

"ఏంర్రో ఈరన్నా రెండు మూడు రోజుల నుండి ఫికరుగ కనబడుతున్నవ్ ఏమైంది?

"ఏం లేదు రాజన్నా. నా గాడిదలు కనిపించడం లేదు." బట్టల మూటలు పెర్గిపోతున్నవి. ఇస్త్రీ చేయా లంటే బట్టల మూటలు గుడిసెలో వేద్దామంటే రెండు రోజుల నుంచి ఆడ ఈడ తిరుగుతున్న నా రెండు గాడిదలు కనిపించడంలేదు."

"అరే! అవి ఏడ్కిపోతై? బందర్‌దొడ్లోకి పోయి సూడు. మన గాడుదులు ఎవరిక్కావాలి."

"ఆడ కూడా సూసిన కనిపించలే."

"నీవేం ఫికరు చేయకు. నా గాడిదలు ఈరోజు తీసుకపో. నేను రెండు రోజులు మా అత్తగారింట్కి పోతున్న."

"హమ్మయ్య, పానం కుదుటపడిందిప్పుడు. నీవు వచ్చిన తరువాత నీ గాడిదలను భద్రంగ ఒప్పచెబుతా."

"నేను రాకపోయినా నీవేం బుగులు పడకు. నా గాడిదలు ఏడకుపోవులే. బే ఫికరుగ ఉండు"

"మంచిదన్నా"

రాజన్న గాడిదలను తోలుకొని వాటిపై బట్టల మూటలు వేసి రాత్రి గుడిసెకాడనే కట్టేసిండు. మొదటి రోజు మామూలుగానే జరిగింది.

అమావాస్య చీకటి మొదలైంది. బట్టలన్నీ ఉతికి ఆరబెట్టేసర్కి బాగా చీకటి పడింది. బట్టల మూటగట్టు కొని గాడుదుల కోసం మూసి ఒడ్డంట పోయిండు. ఒక్కటే గాడిద మేస్తుంది. ఇంకోటి కనబడటం లేదు. ఈల వేసిండు. గాడిద జాడ జవాబు లేదు. బుగలైంది. ఏదో కీడు ఆలోచన వచ్చింది.

అంతలోనే వెంకన్న, పోశన్న లైట్లు పట్టుకొని వెతుకుతున్న కొంతమంది దోభీలు పరేశానీగా కనబడుతున్నారు.

"ఏందైందన్నా" అడిగాడు రాజన్న.

"మన గాడిదలు కనిపించటంలేద్రా. నాలుగు రోజుల నుండి ఒకటొక్కటి మాయమవుతున్నాయి. లైటు ఆర్పేసి ఈడనే కాపేద్దాం. గాడిదల మాయం గావడం కనిపెడ్దాం. మేమిద్దరం ముగ్గురం ఉంటాం. మీరు అందరూ పోండి" అని చేతుల్లో కర్రలు, బ్యాటరీలు పట్టుకొని తుప్పల మాటున నక్కిన్రు.

ఇంతలో అర్ధరాత్రి అయింది. చీకటిగా ఉంది. రెండు మానవాకారాలు గొంగళ్ళు కప్పుకొని ఒడ్డెంబడి పోతున్నారు అటు ఇటు చూస్తూ. వారికి ఒక గాడిద కనిపించింది. వెంటనే దానిమీద పడి కాళ్ళు, నోరు కట్టి గోనె సంచిలో వేసిన్రు. వాళ్ళ ఎంబడే దోభీలు మెల్లమెల్లగ ఎనుక ఎంబడిపోగా ఖాదర్ హోటల్ బిర్యాని సంటర్‌లోకి దూరిన్రు.

"ఇదేందన్నా వీళ్ళు ఖాదర్ బిర్యాని సంటర్‌లోకి పోయిన్రు" గుసగుస మాట్లాడుకుంటు.

పోయినోళ్ళు తలుపేసుకున్రు. అనుమానం వచ్చి ఒకరు బయట ఉండి చాకలి వాడాకు వెళ్ళి మంది కూడబెట్టుకొచ్చి తలుపులు దబదబ బాదిన్రు. ఖాదర్ బామ్మర్ది చేతిలో కత్తితో బయటకు తొంగబడి చూసిండు.

"అరె అల్లా ధోబీలు వచ్చిన్రు" కేకపెట్టిండు.

అంతే పోలోమని దోబీలందరు లోపల జొరపడి చూస్తె ఏముంది గాడిద సగానికి నరకబడి ఉంది.

"గధేకి బిర్యాని ధోబికా పరేషానీ" రహస్యం బయట పడింది. ■